సంప్రదాయాలు అన్నిట మీదా దెబ్బ కొట్టిన ఆపీసరు మీద... కసింత సెయ్యెత్తుతే.. అదే నేరమా? అదే గోరమా? నాకు తెలవదండి. పెద్దలూ.. పెబువులూ.. దరమరాజులూ... తమరే నిరనయించండి. తమరేం చెప్పినా తకరా రుండదండి, తలొంచుతానండి. సమ్మత మేనండి. ఏదేవా మ సిత్తం నండి.

నా సోదంతా ఓపిగ్గా విన్నందుకు శెతకోటి దండాలు బాబూ.

నేను సెప్దామనుకున్నది సంపూర్నమై పోనాదండి.

"దండాలు బాబూ... సెలవండి."

✡ ✡ ✡ ✡ ✡

# ఇడియట్ బాక్స్

ఉదయం పదకొండు గంటలు, అంటే–

కాలేజీ స్టూడెంట్లు ఎక్కువ మంది మార్నింగ్ షోల్లోనూ, అమ్మాయిల కాలేజీల ముందు, క్రికెట్ గ్రౌండ్‌లోనూ, రోడ్ల మీద వుండగా, కొద్ది మంది మాత్రం క్లాస్ రూంలోనూ, హాస్టల్ గదుల్లోనూ వుండే వేళ.

రాష్ట్రంలోనే పేరు పొందిన ఆ ప్రయివేట్ కాలేజీ మగపిల్లల హాస్టల్. రూమ్ నెంబర్ 36లో ఓ అబ్బాయి, ఓ అమ్మాయి. అతను జీన్స్‌తోనూ, ఆమె చుడీదార్‌తోనూ ఆధునికతమ మోడల్స్‌లా వున్నారు. సందీప్, శిరీషల హాస్టళ్ళు వేరయినా కాలేజీ ఒక్కటే. ఇరవయ్యేళ్ళ అబ్బాయీ, 19 ఏళ్ళ అమ్మాయి ఒకే గదిలో తలుపులు మూసుకుని ఉన్నారనీ, వాళ్ళిద్దరూ ప్రేమించుకుంటున్నారనీ, జరగరానిదేదో జరుతోందనో అపార్థం చేసుకోనక్కర్లేదు. వాళ్ళిద్దరూ ఇప్పుడు ఏ కొత్త ప్రేమో ఎగరెయ్యలేనంత ఎత్తుల్లో, రంగుల ప్రపంచంలో విహరిస్తున్నారు.

పదకొండు గంటలంటే ఆ హాస్టల్‌కి పోస్ట్‌మాన్ వచ్చే వేళ కూడా. ఆ ఇద్దరూ ఎదురు చూస్తున్నది పోస్టుమాన్ కోసమే. ఐతే వీళ్ళ తహతహ తపాలా మనిషి ఎచ్చే మనియార్డరు కోసమూ కాదు, అమ్మా నాన్న రాసే ఉత్తరమ్ముక్క కోసమూ కాదు. నాలుగేళ్ళ సాన్నిహిత్యం వీళ్ళది. వీళ్ళిద్దరినీ దగ్గర చేసింది వాళ్ళ ఉమ్మడి అభిరుచీ, ధ్యేయమూ. ఇద్దరికీ సినిమాలంటే పిచ్చి. సినిమా క్విజ్‌లో విజేతలు కావడం వాళ్ళ జీవిత ధ్యేయం. ఆదర్శం. అందుకే వాళ్ళిద్దరూ జట్టు కట్టారు. కాలేజీలో కాలుపెట్టిన తొలి నెలలోనే ఇద్దరూ ఒకటై అప్పటినుంచి వివిధ పత్రికల సినిమా పజిల్స్‌నీ, సినిమా గళ్ళ నుడికట్లనీ సాధిస్తూ టీవీలో సినిమా పజిల్స్ స్థాయికి ఎదిగిపోయారు.

"మొన్నటికి మొన్న యాభై, నిన్న అరవై, ఈ వీకెన్నొస్తాయో!"

"కనీసం డెబ్బయి. సందీప్! ఫాన్ మెయిల్‌కి జవాబులు రాయొద్దూ పేరు పేరునా?"

"ఔను. ఒక విజయం మరో విజయానికి సోపానం కావాలి. ఈ విజయం ప్రారంభం మాత్రమే. రాష్ట్ర రాజధానిలో గెలిచాం. దేశ రాజధానిలో గెలవొద్దూ?"

అంతలోనే పోస్టుమాన్ వచ్చాడు. ఉత్తరాల కట్ట అందిస్తూ " మొన్నట్నుంచీ మీకు కట్టలు కట్టలు ఉత్తరాలు వస్తున్నాయే?" అన్నాడు అమాయకంగా.

"ఇవి ఉత్తరాలు కావు, ఫాన్ మెయిల్" పోస్ట్‌మాన్‌ని వెటకారంగా చూస్తూ గర్వంగా చెప్పాడు సందీప్.

పోస్ట్‌మాన్ అర్థం కానట్టు చూసి వెళ్ళిపోయాడు.

"ఇవాళ ఇరవై రెండు" అన్నాడు సందీప్ నిరుత్సాహంగా ఆవేళ వచ్చిన ఉత్తరాల కట్టను చూస్తూ.

"రేపొస్తాయేమో ఒక్కుమ్మడిగా, పోస్టల్ డిపార్ట్‌మెంట్ సవ్యంగా పనిచేస్తుందా ఏం?"

ఒక్క క్షణం ఆగి "నేషనల్ లెవెల్‌లో గెలుస్తాం కదా. అప్పుడు వేలకొద్దీ ఫాన్ లెటర్సొస్తా యనుకుంటాను" అంటూ అప్పుడు వచ్చిన ఉత్తరాలని చూస్తున్న శిరీష "ఈ కవరేమిటి చాలా బరువుగా వుంది? ఎన్ని అభినందనలని తెచ్చిందో మరి?" అంది ఆ కవరుని సందీప్‌కి అందిస్తూ.

సందీప్‌కి ఒక్కసారి ఉత్సాహం పొంగుకొచ్చింది. ఆ కవరుమీద ఫ్రమ్ అడ్రస్ లేదు. చాలా బరువుగా వుంది.

"ఏ సినిమా వాళ్ళనుంచేనా ఆఫరేమో?" మెల్లగా అందామె.

సినిమా ఛాన్స్! అతనిలో ఒక్కసారి ఏదో ఆనందం. గుండె వేగంగా కొట్టుకోసాగింది. వొణుకుతున్న వేళ్ళతో ఆ కవరుని తెరిచాడెలాగో.

"అజయ్!

మొన్న ఆదివారం టీవీలో సినిమాల మీద పోటీ చూడడం తటస్థించింది. ఆ పోటీకి తయారైన జంటలో ఒకదానితో నువ్వు. ఒక్కక్షణం పాటు నేను దిగ్భ్రాంతి చెందాను. సరే ఆ పోటీలో అడుగుతున్న ప్రశ్నలు వింటూంటే నాకు నిజంగానేమతి పోయింది. పాట మధ్యలో ముక్క వినిపిస్తే ఆ పాటను మొదటినుంచీ పాడటం, పాట చెప్పి అది తెరమీద పాడినవారూ, తెర వెనుక పాడినవారూ ఎవరనే ప్రశ్నలు, మ్యూజిక్ బీట్ మాత్రమే వినిపించి అది ఏ సినిమాలోదో, ఆ సినిమాకి దర్శకుడెవరో లాటి ప్రశ్నలు, క్లిపింగ్ చూపించి ఆ సినిమాకి పని చేసిన మేకప్‌మేన్ పేరు... అన్నీ ఇలాంటివే. ఐతే ఆ సినీ యక్ష ప్రశ్నలకి నువ్వు ప్రేక్షక ధర్మరాజులా అవలీలగా సమాధానాలు చెప్పేస్తుంటే, ట్యూన్‌తో సహా పాటలు పాడేస్తుంటే నాకు కళ్ళు తిరిగిపోయాయి. కలయో వైష్ణవ మాయో అనిపించింది.

ఇలాంటి క్లిష్టమైన పరీక్షలో ప్రథముడిగా రావడానికి నువ్వు తక్కువ కృషి చేసి వుండవు. సంవత్సరాల తరబడి అదే పనిగా సినిమాలు చూస్తూ, సినిమా పాటలు వింటూ, సినిమా చరిత్రనీ, వర్తమాన్నాన్నీ నిరంతరాధ్యయనం చేసుంటావు. ఇతర విషయాలన్నీ వదిలేసి ఏకాగ్రతతో సినీ తపస్సు చేసుంటే తప్ప ఇంత అపారమైన ప్రతిభ అసాధ్యం."

చదవడం ఆపి సందీప్ గర్వంగా తల ఎగరేసాడు.

"మా డాడీ ఉత్తరం చాలా థ్రిల్లింగ్‌గా ఉంది కదూ శ్రీ? మా వంశంలో బుల్లితెరకెక్కిన వాడినీ, బహుమతి సంపాదించినదీ నేనే మొదటివాడిని అయ్యుంటాను. టీవీలో కనిపించడం

తక్కువ అచీవ్‌మెంట్ కాదు, మనకొచ్చిన గిఫ్టులు, గిఫ్ట్ హాంపర్లు ప్రత్యక్షంగా చూస్తే మా డాడీ మరీ పొంగిపోతారు."

అతని మాటలకు అడ్డు వస్తూ శిరీష "మా వాళ్ళూ రాసే వుంటారు. ముందు నీ ఉత్తరం పూర్తి చేయ్" అంది శిరీష.

"అది కాదు శిరీ, నాన్నగారు రాసింది నిజమే కదా. ఈ నాలుగేళ్ళుగా పెద్ద తెరమీదా, బుల్లి తెర మీదా ఎన్ని వందల సినిమాలు చూసామో. ఎన్ని సినిమా పత్రికలు, పుస్తకాలు కంఠతా పట్టామో, ఎన్నెన్ని పాటలు ఎన్నెనిసార్లు చెవులప్పగించి విన్నామో, ఎందరు సినీ గాయక, దర్శక, సంగీత దర్శక, నటీనటుల వివరాలు అహోరాత్రులు అధ్యయనం చేశామో, నిజంగా ఆ దీక్ష, తపస్సే... కాదనగలవా?"

అందుకేగా తొలి ప్రయత్నంలోనే ప్రథమ బహుమతి కొట్టేశాం? కష్టే ఫలీ అని ఊరికే అన్లేదు పెద్దలు. ఊ... చదువ్" అంది శిరీష. సందీప్ మళ్లీ చదవడం ప్రారంభించాడు.

"ఐనా నిన్ను నేనభినందించ లేకపోతున్నాను సరికదా నీమీద జాలే పడుతున్నాను. నీ తండ్రిని కనుక, నీ బాగోగులూ, భవిష్యత్తు పట్ల బాధ్యత గలవాడిని కనుక, నీ మేలు కోరేవాడిని కనుక నీకు నిష్టూరంగా అనిపించినా కొన్ని నిజాలు చెప్పక తప్పడం లేదు నాకు.

అజయ్! నీది మధ్య తరగతి కుటుంబం. నీ తండ్రి నిన్నిక్కడ రెసిడెన్షియల్ కాలేజీలో పెట్టి చదివించడానికి తలకి మించిన బరువెత్తుకున్నాడు. నువ్వు బాగా చదువుకుని మంచి ఉద్యోగం సంపాదించి ప్రయోజకుడివై మమ్మల్నాదుకుంటావనే ఆశతోనే ఆర్థిక బాధలను భరిస్తూ వొస్తున్నాం ఇంటిల్లిపాదీ. కానీ నీ మీద మేమంతా పెంచుకున్న కలలూ ఉంచుకున్న ఆశలూ మరెన్నటికీ అతుక్కో లేనంతగా చెదిరిపోయాయి. మొన్న టీవీ క్విజ్, నువ్వక్కడ చదువుతున్న చదువేమిటో స్పష్టంగా చెప్పింది. నీ జీవితంలో అమూల్యమైన ఐదు సంవత్సరాలూ, నా కష్టార్జితం లక్షా పాతికవేలూ బూడిదలో పోసిన పన్నీరు, గోడక్కొట్టిన సున్నమూ అయ్యాయి. నేనొకటి తలిస్తే నువ్వొకటయ్యావు. సినీ మాయచేత అంతగా ఆవరించబడిన నీ మెదడు నిజ జీవితానికి పనికొచ్చే మరే చదువునీ స్వీకరించగలిగే స్థితిలో మిగలదని నా నమ్మకం. నీ మెదడుకంత దట్టంగా సినీ జ్ఞాన గ్రహణం పట్టేసిందని నా విశ్వాసం.

అజయ్! సినిమా వినోదం మాత్రమే. బతుకులో చిన్న భాగం మాత్రమే. దానినే జీవితమూ, సర్వమూ అనుకుంటే విద్యార్థులు నీలాగే తేరుకోలేనంతగా నష్టపోతారు జీవితంలో. పాండోరాక్స్ బాక్స్ ప్రపంచానికి కష్టాలను తెరువగా, ఇడియట్ బాక్స్ అనబడే టీవీ విద్యార్థి లోకానికి పతనాన్ని తెరుస్తూన్నట్లుంది. సరే నీ విద్యా ద్వారాన్ని సినిమాలూ, టీవీలూ మూసేసాయి కనుక నీ కోసం ఉపాధి ద్వారం తెరుస్తున్నాను నేను. మన ఊరిలో స్కూటర్ మెకానిక్ దగ్గర అప్రెంటీస్‌గా చేర్చడానికి తిరుగులేని నిర్ణయం తీసుకున్నాను. అదయినా శ్రద్ధగా నేర్చుకుంటే మమ్మల్నుద్ధరించడం మాట అటుంచి నీ బతుకేనా నువ్వు బతగగలవేమో అని ఆశ. మన మధ్య తరగతి మనుషులు కాలంతో గానీ, డబ్బుతో గానీ ఆటలాడలేరు. ఏ తండ్రయినా కొడుకుని చదువుకొమ్మని అవకాశం కల్పించగలడే తప్ప చదువుని అతని బుర్రకెక్కించ లేడు. సోమవారం వచ్చి టీసీ తీసుకుని నిన్ను మన వూరు తెచ్చేస్తాను. ఈ ఉత్తరాన్ని మీ ప్రిన్సిపాల్‌కి చూపించు. ఇంటికి తిరిగి వచ్చేందుకు సన్నాహాలు చేసుకో.

– దురదృష్టవంతుడైన నీ

తండ్రి"

సందీప్ చేతిలోంచి ఉత్తరం జారింది. గాలిలో కాగితాలు ఎగిరిపోతున్నాయి. సందీప్ ఊహలు కూడా ఎగిరిపోతున్నాయి.

(ఈ కథ "దారితప్పిన పిల్లలు" అనే పేరుతో ఆంధ్రభూమి మాస పత్రికలో ప్రచురితమయింది (సెప్టెంబర్-2000), "ఇడియట్ బాక్స్" అనే పేరుతో నేను రాసిన యీ కథకు డి.టి.ఎస్. కల్చరల్ అసోసియేష్, విశ్వాఖపట్నం నుండి బహుమతి లభించి, ఆకాశవాణి విశాఖపట్నంలో ప్రసారమయింది)

✡ ✡ ✡ ✡ ✡

30019
20.7.05